
షార్‌లో సంబరం

- జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 ప్రయోగం సక్సెస్
- నిర్ణీత కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహం
- ఈ ఏడాది ఇస్రోకు తొలి విజయం
- షార్‌లో అంబరాన్నంటిన సంబరాలు



రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

సూళ్లూరుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రయోగానికి 27.30 గంటల ముందు.. మంగళవారం తెల్లవారుజామున 2.10 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. '0'కి చేరగానే.. సమయం బుధవారం సాయంత్రం 5.40 గంటలు అయింది. అంతే ఒక్కసారిగా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ నిప్పులు చెరుగుతూ.. నింగిలోకి దూసుకెళ్లింది. రాకెట్ మూడు దశలను విజయవంతంగా పూర్తిచేసి 18.40 నిమిషాల్లోనే 2,392 కిలోల బరువైన నిసార్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో-నాసా సంయుక్తంగా చేపట్టిన ఈ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ప్రకటించడంతో షార్‌లో సంబరాలు మిన్నంటాయి. శాస్త్రవేత్తలు ఆనందోత్సాహాలతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఈ విజయం.. రోదసి ప్రయోగాల్లో మరోసారి మన శాస్త్రవేత్తల సత్తా చాటింది. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి సుమారు ఆరువేల మంది దాకా వచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు వీక్షకులు మధ్యాహ్నామే షార్‌కు తరలివచ్చారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులున్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు తెల్లవారుజామునుంచే వాహనాలు బారులు తీరాయి. రాకెట్ నింగికి ఎగురుతున్న సమయంలో వీక్షకుల చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో వీక్షకులు గ్యాలరీ వద్దే ఆనందంతో సంబరాలు చేసుకొన్నారు.

సవాల్‌గా తీసుకుని..

ఈ ఏడాది జనవరి 29న ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 ప్రయోగం అనంతరం ఉపగ్రహ సంకేతాలు అందలేదు. అనంతరం మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగం విఫలమైంది. ఈ రెండు వైఫల్యాలను శాస్త్రవేత్తలు సవాల్‌గా తీసుకున్నారు. మూడోసారి.. అత్యంత ఖరీదైన, నాసా, ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేసిన నిసార్ ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో మన శాస్త్రవేత్తలకు అగ్రదేశాల నుంచీ ప్రశంసలు అందాయి. కాగా, ఈ ఏడాది



వీక్షకుల గ్యాలరీలో విద్యార్థుల సందడి

చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం

ఇది చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం. బుడిబుడి అడుగుల నుంచి నేడు స్వదేశీ పరిజ్ఞానంతో అమెరికా వంటి అగ్రదేశంతో కలిసి భారీ ప్రయోగాలు చేపట్టే స్థాయికి ఎదిగాం. ఇదంతా మన శాస్త్రవేత్తల సమష్టి కృషి ఫలితమే. ఊహించిన ప్రకారమే నిసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టాం. ఇది ఇస్రో,నాసా సంయుక్త విజయం.

- వి.నారాయణన్, ఇస్రో చైర్మన్



మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్ నారాయణన్



నిప్పులు చిమ్ముతూ నింగిలోకి వెళ్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్



ప్రయోగాన్ని వీక్షిస్తున్న నాసా శాస్త్రవేత్తలు


ఇస్రోకు ఇది తొలి విజయం. కాగా, భూ పరిశీలన, సునామీ, విపత్తుల హెచ్చరికలు ముందుగానే పసిగట్టి సమాచారాన్ని చేరవేసేందుకు నిసార్ ఎంతో దోహదపడనుంది.

రాకెట్ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు

షార్ వేదికగా జరిగిన నిసార్ ఉపగ్రహ ప్రయోగ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు డాక్టర్ కె.రాధాకృష్ణ, ఏఎస్.కిరణ్ కుమార్ విచ్చేశారు. వీరితో పాటు పలువురు శాస్త్రవేత్తలు కూడా విచ్చేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు.








రాకెట్ మొదటి, రెండవ, మూడవ దశలు

రెండో విడత 'దీపం' బుకింగ్‌కు

నేటితో ఆఖరు



తిరుపతి(నేరవిభాగం), జూలై 30(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తోంది. ఈ దీపం-2 పథకం కింద రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్‌కు గురువారంతో గడువు ముగియనుంది. ప్రభుత్వం అందచేసిన షెడ్యూల్ ప్రకారం జూలై 31లోగా సిలిండర్ బుక్ చేసుకోవాలి. ఒకసారి గడువు దాటిన తర్వాత అదే విడత కింద సిలిండర్ బుకింగ్‌కు అవకాశం ఉండదని డీఎస్వో శేషాచలం రాజు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4.20 లక్షల కనెక్షన్లు వున్నాయి. ఇందులో రెండో విడత కింద ఏప్రిల్ నుంచి జూలై 30 వరకు 3,63,297 మందికి ఉచిత సిలిండర్లు డెలివరీ అయ్యాయి. అందులో 3,45,040 మంది బ్యాంకు ఖాతాలకు ఇప్పటి వరకు సబ్సిడీ నగదు రూ.29.31 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో 3,15,303 మంది లబ్ధిదారులకు వారి వారి బ్యాంకు ఖాతాల్లో రూ 26.76 కోట్లు జమ అయ్యాయి. మిగిలిన వారికి నగదు జమకావాల్సి ఉంది. కాగా, ఆగస్టు ఒకటో తేది నుంచి మూడో విడత రాయితీ, సిలిండర్ వర్తింపు ప్రారంభం కానుంది.

రాయితీ జమ కాకుంటే 1967కు కాల్ చేయండి

ప్రభుత్వం నుంచి సబ్సిడీ సిలిండర్‌కు సంబంధించి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కాకుంటే వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేసి సమస్య తెలియచేయవచ్చును. ఈ విషయమై ముందుగా గ్యాస్ ఏజెన్సీని సంప్రదించాలి. మళ్లీ ఈకేవైసీ చేయించుకుని మరొక సారి బ్యాంకు అధికారులను సంప్రదించాలి. రాయితీకి సంబంధించి అర్హత ఉంటే తప్పనిసరిగా ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది. దీపం-2 కింద ఒక్క రోజులో గడువు ముగుస్తున్నందున మరో 18,000 మంది లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోవాలని డీఎస్వో శేషాచలం రాజు విజ్ఞప్తి చేశారు.

4,771 మందికి భాగస్వామి పింఛన్లు

- ఆగస్టు నుంచి పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 4,771 మందికి భాగస్వామి (స్పౌజ్) పింఛన్లు మంజూరయ్యాయి. వీరికి ఆగస్టు నుంచి పింఛను ఇవ్వనున్నారు. ఇంటిపెద్ద దిక్కు కోల్పోయి వేదన అనుభవిస్తున్న వితంతువులకు కూటమి ప్రభుత్వం కొండత అండగా నిలిచింది. కొంత కాలంగా వీరిని ఊరిస్తున్న భాగస్వామి పింఛనును ఆగస్టు ఒకటిన పంపిణీ చేయనున్నారు. 2023 డిసెంబరు ఒకటి నుంచి 2024 అక్టోబరు 31 మధ్య సామాజిక భద్రత పింఛను తీసుకుంటూ మృతి చెందిన వారి పింఛనును.. వారి జీవిత భాగస్వామికి బదలాయించేందుకు ఏప్రిల్ 24 నుంచి చర్యలు ప్రారంభించారు. మరణించిన లబ్ధిదారుడి వివరాలు, ధ్రువపత్రంతో పాటు జీవిత భాగస్వామి వివరాలు గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించి ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. వీరితో పాటు 2024 నవంబరు నుంచి మృతి చెందిన వారి భాగస్వామికీ (స్పౌజ్) పింఛను అవకాశం కల్పించారు. దీంతో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని పింఛను కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో జూన్‌లో పంపిణీ చేస్తామని చెప్పి ఆఖరి నిమిషయంలో వాయిదా వేశారు. జూలైలోనూ వాయిదా పడింది. తాజాగా ఆగస్టులో భాగస్వామి పింఛన్లు అందుతాయని ప్రభుత్వం చెప్పడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 4,771 మందిని భాగస్వామి పింఛన్లకు అర్హులుగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. దరఖాస్తులు సైతం స్వీకరించలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ భరోసా పథకంలో స్పౌజ్ పింఛను విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సామాజిక పింఛను తీసుకునే భర్త మృతి చెందితే భార్యకు, ఆ మరుసటి నెల నుంచే పింఛను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

రేపు సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను శుక్రవారం 2,63,743 మందికి సచివాలయ సిబ్బంది పంపిణీ చేయనున్నారు. ఉదయం 6.30 గంటల నుంచే ఇంటింటికి వెళ్లి పింఛను అందజేయనున్నారు. పింఛన్లకుగాను రూ.113కోట్లు కేటాయించినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు.



ఫెర్టిలిటీ సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

ఫెర్టిలిటీ సెంటర్‌లో తనిఖీలు

తిరుపతి(వైద్యం), జూలై 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు, విశాఖలోని 'సృష్టి' కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో తిరుపతిలోని ఫెర్టిలిటీ సెంటర్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. లావణ్య ఫెర్టిలిటీ సెంటర్‌ను బుధవారం డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ తనిఖీ చేసి సేవలను, రికార్డులను, వైద్య పరికరాలను పరిశీలించారు. ఫెర్టిలిటీ సెంటర్లు ఏఆర్‌టీ చట్ట ప్రకారం నడుచుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఐవో శాంతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.68కోట్లు

శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీ ద్వారా రూ.2,68,87,640 లభించింది. ఆలయంలోని కోట మండపం వద్ద బుధవారం హుండీలను లెక్కించారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల హుండీల ద్వారా బంగారం 97 గ్రాములు, వెండి 882.640 కేజీలు, విదేశీ కరెన్సీ 235 వచ్చాయి. 40 రోజులకు ఈ హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. లెక్కింపులో ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి డాలర్ల కేసులో..

15 మందిపై చర్యల నిలిపివేత

- ఆరోపణలు రుజువు కాకపోవడంతో ప్రభుత్వ ఉత్తర్వులు
- 19 ఏళ్ల తర్వాత ఆరోపణల నుంచి విముక్తి

తిరుపతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి డాలర్ల విక్రయ కౌంటర్‌లో అక్రమాలు జరిగాయంటూ 19 ఏళ్ల కిందట సంచలనం సృష్టించిన కేసులోని ఆరోపణల నుంచి 15 మంది టీటీడీ అధికారులు, ఉద్యోగులు విముక్తి పొందారు. మొత్తం 20 మందిపై ఆరోపణలు రాగా క్రిమినల్, శాఖాపరమైన విచారణల అనంతరం వీరిలో 15 మందిపై చర్యలు నిలిపివేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో పలువురు పదవీ విరమణ చేయగా, కొందరు మరణించారు కూడా. తిరుమల శ్రీవారి డాలర్ల విక్రయాల కౌంటర్‌లో 5 గ్రాముల బరువుండే 300 శ్రీవారి డాలర్లు అదృశ్యమయ్యాయని 2006లో టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం గుర్తించింది. వాటి విలువను రూ.15.40 లక్షలుగా అంచనా వేసింది. ఈ మేరకు విచారణ జరిపి 20 మంది బాధ్యులంటూ టీటీడీకి నివేదిక అందించింది. అప్పట్లో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత ప్రభుత్వం ఈ కేసును సీబీసీఐడీకి అప్పగించగా, వాళ్లు దర్యాప్తు చేసి నివేదిక ఇచ్చారు. విజిలెన్స్, సీబీసీఐడీ నివేదికల ఆధారంగా ప్రభుత్వం సంబంధిత ఉద్యోగులు, అధికారులపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ.. ఆ బాధ్యతను కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించింది. తొలుత కేసును అప్పటి కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ సభ్యుడైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ సుబ్రేంద్రు భట్టాచార్యకు, తర్వాత మరో సభ్యుడు, రిటైర్డు ఐపీఎస్ అధికారి జె.సత్యనారాయణకు అప్పగించారు. గతేడాది జనవరిలో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. విచారణలో 15 మంది ఉద్యోగులు, అధికారులపై ఆరోపణలు రుజువు కాలేదని నివేదికలో పేర్కొంది. వీరిపై చర్యలు నిలిపివేయాలని టీటీడీ ఈవో ప్రభుత్వాన్ని కోరగా.. ఆ మేరకు రెవెన్యూ శాఖ ఎఫ్ఏసీ ముఖ్య కార్యదర్శి వి.వినయ్‌చంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ 15 మంది వీరే

తిరుమల పేష్కార్ కార్యాలయ సూపరింటెండెంట్లు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.రఘురామిరెడ్డి, ఇ.రామచంద్రారెడ్డి, ఏవీ రమణమూర్తి, డీఈవో ఆర్.రంగనాథాచారి, ఇన్‌స్పెక్షన్ విభాగం ఏఈవో కె.చిత్తరంజన్, సీనియర్ అసిస్టెంట్, ఎస్వీ ఆయుర్వేదిక్ ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్లు బి.మురళీకృష్ణమూర్తిరాజు, రావినూతల శ్రీరామ్, సూపరింటెండెంట్లు ఎం.వెంగన్న, కె.గోవర్ధన్, డిప్యూటీ ఈవో ఎస్.చెంచులక్ష్మి, సీనియర్ అసిస్టెంట్, బొక్కసం క్లర్క్ బీఆర్ గురురాజారావు, రిసెప్షన్ విభాగం డిప్యూటీ ఈవో ఆర్.ఉమాపతి, వైకుంఠం క్యూ కాంప్లెక్సు ఏఈవో, ఇన్‌స్పెక్షన్ విభాగం సూపరింటెండెంట్ ఎస్.గజపతి. వీరిలో గురురాజారావు, రావినూతల శ్రీరామ్ సర్వీసులో ఉన్నారు. మురళీకృష్ణమూర్తి రాజు, ఎం.వెంగన్న, ఏవీ రమణమూర్తి రిటైరై మరణించారు.

16న శ్రీకృష్ణస్వామి ఆలయంలో గోకులాష్టమి వేడుకలు

పెద్దశేష వాహనంపై స్వామివారి అభయం

తిరుచానూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణస్వామి ఆలయంలో ఆగస్టు 16న గోకులాష్టమి వేడుకలు టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉదయం స్వామివారి మూలవర్లకు అభిషేకం, అర్చన నిర్వహిస్తారు. ముఖమండపంలో మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు శ్రీకృష్ణస్వామి ఉత్సవర్లకు తిరుమంజనం, సాయంత్రం ఊంజల సేవ చేస్తారు. రాత్రి 7గంటలకు స్వామివారు పెద్దశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమివ్వనున్నారు. రాత్రి 8.30 నుంచి 9గంటల వరకు గోపూజ, గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. 17న ఉట్లోత్సవాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, ఊంజల్‌సేవ చేస్తారు. సాయంత్రం 6.15 నుంచి రాత్రి 7.30గంటల వరక ఉట్లోత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు. 16న ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవను టీటీడీ రద్దు చేసింది.

రాయలవారి జయంతి సాధనకు నేడు పాదయాత్ర

చంద్రగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతి సాధన కోసం గురువారం ఉదయం చంద్రగిరి కోట నుంచి అలిపిరి వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు రాయల్ పీపుల్స్ ఫ్రంట్ సెంట్రల్ జాయింట్ యాక్షన్ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు తిరుమల శ్రీవారికి పరమభక్తుడని, ఆయన్ను ఏడుసార్లు దర్శించుకుని, బంగారు, వజ్ర, వైఢూర్యాలను సమర్పించారని తెలిపారు. అలాంటి వ్యక్తిని ప్రభుత్వాలు, టీటీడీ విస్మరిస్తున్నాయని తెలిపారు. కనీసం చంద్రగిరిలో రాయలవారి విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఇందుకు నిరసనగా చేపట్టనున్న ఈ పాదయాత్రలో బలిజ కులస్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

2 నుంచి ఉపాధి గ్రామసభలు

చంద్రగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆగస్టు 2వ తేదీ నుంచి ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఏపీవో భార్గవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు ఈ పథకంలో రూ.20.60 కోట్లతో జరిగిన పలు అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామ సభల్లో పనుల వివరాలు, ఖర్చులు తెలియజేయనున్నట్లు వివరించారు. మండల స్థాయి సామాజిక తనిఖీ బహిరంగ సభ 22వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.

బొప్పరాజుపల్లిలో కావిడి మహోత్సవం


ఊరేగుతున్న కావళ్లు

రామచంద్రాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపల్లి పంచాయతీ బొప్పరాజుపల్లి గ్రామంలో బుధవారం కావిడి మహోత్సవం నిర్వహించారు. తమిళ ఆడినెలలో గ్రామస్థులు ఇంటికొక కావిడి చొప్పున తిరుత్తణికి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా 130మంది పుష్ప కావళ్లు తీసుకుని గ్రామంలో మేళతాళాల నడుమ ఊరేగించారు. గ్రామస్థులు వారికి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం ప్రత్యేక బస్సుల్లో తిరుత్తణికి బయలుదేరి వెళ్లారు.

సుపరిపాలనలో తొలి అడుగు


కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపల్లి పంచాయతీ బొప్పరాజుపల్లి గ్రామంలో బుధవారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీఎన్‌టీయూసీ మండలాధ్యక్షుడు సోమురాయల్ మాట్లాడుతూ టీడీపీ పాలనలోనే పేదల అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధు యాదవ్, ప్రకాష్ యాదవ్, అజిత్, గురుస్వామి పాల్గొన్నారు.

పెద్దవంక వంతెనపై మొక్కలు


వంతెనపై పెరిగిన మొక్కలు

పాకాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువు పెద్దవంకకు అడ్డంగా నిర్మించిన వంతెనకు ఇరువైపులా రావి మొక్కలు పెరిగాయి. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థలో ఉంది. వంతెనకు ఇరువైపులా రావిచెట్లు ఏపుగా పెరగడంతో వేర్లు చొచ్చుకునిపోయి వంతెన పాడైపోయే ప్రమాదముంది. ఈ వంతెనపై నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. దామలచెరువు టౌన్ - మ్యాంగోనగర్ అనుసంధానంగా ఉన్న ఈ వంతెన పాడైతే ఈ మార్గంలో రాకపోకలు స్తంభించే అవకాశముంది. పైగా వంతెనకు ఇరువైపులా పెద్దవంకలో వ్యర్థాలు పడేస్తుండడంతో దుర్గంధంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. రావిమొక్కలు, వ్యర్థాలు తొలగించి, వంతెనకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పైపులైన్ లీకేజీతో రోడ్డుపై నీళ్లు


మల్లప్పగారిపల్లెలో తాగునీటి పైపు లీకేజీతో రోడ్డుపై నిల్వ ఉన్న నీరు

పాకాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువు పంచాయతీ మల్లప్పగారిపల్లెలో తాగునీటి పైపులైన్ లీకేజీ అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. 40 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. బోరు మోటరు ద్వారా డైరెక్ట్‌గా పైపులైన్ ద్వారా కొళాయిలకు నీరు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో రోడ్డు పక్కన, పేడదిబ్బల వద్ద పైపులైన్ డ్యామేజీ కావడంతో రోడ్డుపైకి నీళ్లు చేరుతున్నాయి. మోటారు ఆపినపుడు లీకేజి అయిన నీళ్లు మళ్లీ పైపుల్లోకి వెళ్లి కలుషితమవుతున్నాయి. పలుసార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

వైభవంగా అర్జున తపస్సు



భాకరాపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా బుధవారం అర్జున తపస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాభారతంలో అర్జునుడు పాశుపతాస్త్రం సాధన కోసం శివుడి గురించి తపస్సు చేస్తాడు. ఈ రోజు జరిగిన కార్యక్రమంలో అర్జున వేషధారి తపస్మానును అధిరోహిస్తూ మెట్టుమెట్టుకు మహాభారత పద్యాలను ఆలపిస్తూ పైకి చేరుకున్నాడు. పై నుంచి పువ్వులు, విభూది పండ్లు, నిమ్మకాయలు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. వీటిని ఇళ్లలో పెట్టుకుంటే మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. భాకరాపేటకు చెందిన అగ్రహారం మధు కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

వందశాతం అక్షరాస్యతకు ప్రణాళిక



మాట్లాడుతున్న శోభన్‌బాబు, పక్కన మహమ్మద్ ఆజాద్, ఎంపీడీవో రామచంద్ర

తిరుపతిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం అక్షరాంధ్ర శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఏపీఎంలు, ఏపీవోలు, సీఎంఎంలు, వయోజనవిద్య సిబ్బంది హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఆధ్వర్యంలో సర్వే ద్వారా జిల్లాలో అక్షరాంధ్ర మొదటి విడతగా ఈ ఏడాది 88,687మంది వయోజనులైన నిరక్షరాస్యులను తీసుకుని, వారందర్నీ అక్షరాస్యులుగా చేయడానికి డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా శాఖ నేతృత్వంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. వయోజన విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ ఆజాద్ మాట్లాడుతూ పదిమంది నిరక్షరాస్యులకు ఒక వలంటీర్ చొప్పున చదువు చెప్పాలని సూచించారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో సాయంత్రం 5-7గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అభ్యాసకులందరికీ 2026 మార్చిలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. నోడల్ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ స్వయం సహాయక బృందాలు, పనికి ఆహార పథకంలోని లబ్ధిదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆకట్టుకున్న అర్జున తపస్మాన్


తపస్మాన్‌ని అధిరోహిస్తున్న అర్జున వేషధారి

తిరుపతిరూరల్,జూలై30(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలోని ద్రౌపదీసమేత ధర్మరాజస్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం వైభవంగా జరిగింది. అర్జున వేషధారి శివుడి పాశుపతాస్త్రం సాధించేందుకు ఆలయం ముందు ఏర్పాటు చేసిన తపస్మాన్ ఒక్కో మెట్టు అధిరోహిస్తూ శివుడ్ని ప్రార్థన చేశారు. శిఖరాగ్రం చేరుకుని తనవద్ద ఉన్న ఆయుధాలను జమ్మిచెట్టులో భద్రపరుస్తూ విభూది, పూలు, నిమ్మపండ్లు విసరడంతో భక్తులు వాటిని అందుకున్నారు. తమ కోర్కెలు తీర్చాలని భక్తులు తపస్మాన్ చుట్టూ వరపడ్డారు. మధ్యాహ్నం భాగవతారిణి పద్మవ్యూహంలో అభిమన్యుడు కౌరవులతో పోరాడిన ఘట్టాలను రమ్యంగా వినిపించారు. సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవమూర్తుల ఊరేగింపు గ్రామ వీధుల్లో కన్నులపండువగా సాగింది. గ్రామస్తులు మంగళహారతులు సమర్పించారు. ఉభయదారుగా జయసింహారెడ్డి వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు


విజేతలకు ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లు అందిస్తున్న దివాకర్

తిరుపతిరూరల్,జూలై30(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట క్రీడా మైదానంలో జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలురకు రెండు రోజుల పాటు నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. అండర్-14 విభాగంలో లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ విద్యార్థులు మొదటిస్థానం, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రెండవ స్థానం, సోక్రటీస్, నాగార్జున పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మిశ్రమంగా మూడోస్థానాన్ని సాధించారు. అండర్-17లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, రెయిన్‌బో స్కూల్ వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలవగా, లిటిల్‌ఏంజెల్స్, జీఎస్ఆర్ మాగ్నటిక్ విద్యార్థులు మిశ్రమంగా తృతీయ స్థానంలో నిలిచారు. ప్రతిభచాటిన విద్యార్థులకు లక్ష్మీచారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ కె.దివాకర్ చేతుల మీదుగా ట్రోఫీ, మెడల్స్ సర్టిఫికెట్లుఅందించారు. అండర్-14లో ప్రథమస్థానం, అండర్-17లో తృతీయ స్థానాలు సాధించిన లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విద్యార్థులను కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఎం.రమాదేవి, డైరెక్టర్ డాక్టర్ కేఆర్ శ్వేత అభినందించారు. అసోసియేషన్ ప్రతినిధులు దేవరాజ్, హేమంత్ కుమార్, మనోహర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై పాలసీ డాక్యుమెంట్ సిద్ధం చేయండి

అధికారులకు అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశం


అధికారులతో చర్చిస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, జూలై30(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో రోజురోజుకు వాహనాలు పెరుగుతున్నాయి. దీంతో వాతావరణ కాలుష్యం అధికమవుతోంది. ఈ క్రమంలో ఘాట్‌రోడ్లలో వాహనాలు, తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణపై పాలసీ డాక్యుమెంట్ సిద్ధం చేయండి' అని అధికారులను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. తిరుమలలోని గోకులం సమావేశ మందిరంలో బుధవారం ఆయన టీటీడీ రవాణా, ఫారెస్ట్, విజిలెన్స్, ఆర్టీఏ విభాగాల అధికారులతో సమీక్షించారు. పాలసీ డాక్యుమెంట్‌లో ఈవీ పాలసీ, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును బలోపేతం చేయడం, ప్రైవేట్ జీపు డ్రైవర్లకు అవగాహన కల్పించడం, పాత వాహనాల వల్ల ఏర్పడుతున్న పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలుచేయడం వంటి అంశాలు చేర్చాలని సూచించారు. తిరుమలలో ప్రీపెయిడ్ ట్యాక్సీ సదుపాయం ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను గుర్తించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం కనీస, గరిష్ఠ ఛార్జీలను నిర్ణయించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, డిప్యూటీ సీఎఫ్ ఫణికుమార్ నాయుడు, విజిలెన్స్ అధికారులు రామ్‌కుమార్, సురేంద్ర, జిల్లా రవాణాధికారి మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవశాస్త్ర రంగంలో ఉన్నత ఉపాధి అవకాశాలు

మలేషియా వర్సిటీ ఫ్యాకల్టీ డాక్టర్ షేక్ మన్సూర్ ఇస్మాయిల్


షేక్ మన్సూర్ ఇస్మాయిల్‌ను సన్మానిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 30 (ఆంధ్రజ్యోతి): జీవశాస్త్ర రంగంలో మంచి సామర్థ్యమున్న వాళ్లకు ఉన్నత ఉపాధి అవకాశాలు లభ్యమవుతున్నాయని మలేషియా యూనివర్సిటీ ఫిషరీస్ అండ్ ఫుడ్ సైన్సెస్ సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ షేక్ మన్సూర్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో 'జీవ శాస్త్రం- సవాళ్లు- అవకాశాలు'పై బుధవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎంపిక చేసుకున్న రంగంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. తద్వారా సంబంధిత రంగంలో విషయ పరిజ్ఞానంతో పాటు సాంకేతిక విజ్ఞానం గురించీ అవగాహన చేసుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో రాణించడానికి ఆత్మ విశ్వాసంతో కృషి చేయాలన్నారు. సంబంధిత రంగంలో రాణించిన ప్రముఖుల జీవిత గాథలను తెలుసుకోవాలని కోరారు. తద్వారా తమ రంగంలో రాణించడానికి అవసరమైన స్ఫూర్తిని పొందవచ్చన్నారు. అబ్దుల్ కలాం వంటి వారు సాధారణ స్థాయి నుంచీ అసాధారణ శక్తిగా ఎదిగారని గుర్తు చేశారు. ఏ రంగంలో ఎదిగినా సామాజిక బాధ్యతను మరువకూడదని విజ్ఞప్తి చేశారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ బీవీ అప్పారావు మాట్లాడుతూ.. వర్తమాన పరిస్థితుల్లో జీవ శాస్త్ర ప్రాముఖ్యత పెరిగిందన్నారు. జీవ శాస్త్రాన్ని ఎవరూ ఎంచుకోకపోతే, భవిష్యత్తులో ఈ సబ్జెక్టు నిపుణులు ఎలా రూపొందుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, ఎస్వీయూ స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, జువాలజీ హెడ్ వాణి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మోహన్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిశ్చితార్థమయ్యాక ముఖం చాటేశాడు

● యువతి ఫిర్యాదు

రేణిగుంట జూలై 30 (ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థమయ్యాక పెళ్లి చేసుకోలేదని యువకుడిపై ఓ యువతి బుధవారం గాజుల మండ్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తూకివాకం పంచాయతీ ఎర్రంరెడ్డిపాలెంకు చెందిన హరితకు ఎస్ఆర్‌పురం మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన ఏసుతో గత ఏడాది డిసెంబర్‌లో ఇరు పక్షాల పెద్దలు నిశ్చితార్థం చేశారు. అయితే ఇప్పటివరకూ ఆ యువకుడు పెళ్లిని దాటవేస్తుండటంతో హరిత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి కేసులో నిందితులకు బెయిల్ నిరాకరణ

చిత్తూరు లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):ఇటీవల ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిచేసిన నిందితులకు చిత్తూరు న్యాయస్థానం బెయిల్ నిరాకరించింది. ఈనెల 9వ తేదీన బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు మాజీ సీఎం జగన్ విచ్చేసిన సందర్భంగా ఫొటోలు తీస్తున్న శివకుమార్‌పై వైసీపీకి చెందిన చక్రవర్తి, శంకర్ ఆచారి, వినోద్ కుమార్, మోహన్ దాడిచేశారు. ఈ ఘటనలో బంగారుపాళ్యం పోలీసులు ఆ నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ నిందితులు ఫస్ట్ ఏడీజే కోర్టులో బెయిల్ పిటీషన్ దాఖలు చేసుకున్నారు. ఆ పిటీషన్ బుధవారం విచారణకు రాగా బెయిల్ పిటీషన్‌ను న్యాయమూర్తి రమేష్ డిస్మిస్ చేశారు.

40 మంది ఏఈల జీతాల నుంచి రూ.30 లక్షల రికవరీ

● నోటీసులు జారీ చేసిన ఏపీఈఆర్సీ

చిత్తూరు రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేసిన 40 మంది ఏఈలపై క్రమశిక్షణ చర్యలకు ఏపీఈఆర్సీ సిద్ధమైంది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు జిల్లావ్యాప్తంగా సుమారు 1050 మంది విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.పరిష్కార విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని టోల్ ఫ్రీ నెంబరు 1912కు ఫిర్యాదు చేశారు. దీనిపై సీరియస్ అయిన ఏపీఈఆర్సీ 40 మంది ఏఈలకు నోటీసులు జారీ చేసింది. ఫిర్యాదులను పరిష్కరించకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని భావించిన ఏపీఈఆర్సీ పరిహారం కింద రూ.30.36 లక్షలు ఏఈల జీతాల నుంచి రికవరీ చేసి 1050 మంది వినియోగదారుల ఖాతాల్లో జమచేయనుంది. చిత్తూరు రూరల్ డివిజన్ పరిధిలో రూ.4.62 లక్షలు, అర్బన్ డివిజన్ పరిధిలో రూ.9.08 లక్షలు, పుంగనూరు పరిధిలో రూ.16.65 లక్షలు రికవరీ చేయనున్నారు.


చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లి లక్ష్మీభారతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు


ఖాళీ స్థలంలో తొలగించిన మురుగునీరు

ఖాళీస్థలంలో మురుగునీరు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతిరూరల్, జూలై30(ఆంధ్రజ్యోతి): పేరూరు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారిని ఆనుకుని ఎన్‌జీవోస్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీలకు సమీపంలో ఖాళీ స్థలంలో చేరిన మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. ఆదివారం ఆంధ్రజ్యోతిలో మురుగుతో ముప్పుతిప్పలు అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై పంచాయతీ కార్యదర్శి స్పందించారు. ఖాళీస్థలంలో మురుగునీరు వదిలేస్తుండడంపై నోటీసు జారీ చేస్తామని అపార్ట్‌మెంట్ యజమానికి సూచించారు. స్పందించిన అపార్ట్‌మెంట్‌మెంట్ యజమాని సత్వర చర్యలు చేపట్టారు. మురుగు నీరు వెళ్లే డ్రైనేజీ పైపునకు లీకేజీ సమస్య ఉండడంతో మరమ్మతు పనులు చేపట్టడంతో పరిష్కారం లభించింది. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.రామపురం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ ఆవరణలో బుధవారం సంఘ సభ్యులు, ఆర్‌వైఎస్ఎస్ కార్యకర్తలకు బుధవారం ఎస్‌పీఎంయూహెచ్‌ఆర్ ఆడిట్ గుంటూరు ప్రధాన కార్యాలయ జెండర్ శ్రీకర్ ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ పద్ధతిలో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం ద్వారా భూమి ఆరోగ్యంతో మన ఆరోగ్యం కూడా చక్కగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, హెచ్‌ఆర్ వాణి పాల్గొన్నారు.

9న శ్రావణ పౌర్ణమి గరుడసేవ

తిరుమల, జూలై30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆగస్టు 9వ తేదీన శ్రావణ పౌర్ణమి గరుడసేవను నిర్వహించనున్నారు. సాధారణంగా ప్రతినెలా పౌర్ణమిరోజున టీటీడీ గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆగస్టు 9న శ్రావణ పౌర్ణమి కావడంతో విశేష సంఖ్యలో భక్తులు రానున్నారు. ఆరోజు రాత్రి 7 గంటలకు మలయప్పస్వామిని విశేష అలంకరణలో గరుడవాహనంపై వేంచేపు చేసి మాడవీధుల్లో ఊరేగించనున్నారు. ఇక, ఆగస్టు నెలలో 2వ తేదీన వెంగమాంబ వర్ధంతి, 4న పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 5 నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు, 10న మలయప్పస్వామి విఖనసచార్యుల సన్నిధికి వేంచేపు, 16న గోకులాష్టమి, 17న శిక్యోత్సవం, 25న బలరామ జయంతి, వరాహ జయంతి కార్యక్రమాలు జరుగనున్నాయి.

ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి

● మరొకరికి గాయాలు


మృతి చెందిన కనికాచలం

తిరుపతి(నేరవిభాగం), జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్‌లో ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ కనికాచలం(50) మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం పాత కాలువకు చెందిన కనికాచలం ఆటో నడుపుకొంటూ తిరుపతికి వస్తున్నారు. ఈ ఆటోలో గాజులమండ్యంకు చెందిన బలిజ రామయ్య వస్తున్నారు. బాలాజీ డెయిరీ సమీపంలో ఆటో వేగంగా వచ్చే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి వెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ కనికాచలం తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రయాణికుడికి తీవ్ర గాయాలవడంతో రుయాకు తరలించారు. కుటుంబ పెద్ద మృతితో జీవనాధారం కోల్పోయామని మృతుడి కుటుంబీకులు రోదించారు. మృతుడి కుమారుడు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

'జగన్ పర్యటనను విఫలం చేసేందుకు కుట్ర'

తిరుపతి(జీవకోన), జూలై 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ నెల్లూరు పర్యటనను విఫలం చేసేందుకు ప్రభుత్వం కుట్రపన్నుతోందని ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆరోపించారు. తిరుపతిలోని ఆయన నివాసం వద్ద బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మేయర్ శిరీష, టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, నగరఅధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

సత్యవేడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వ్యకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్యవేడులో బుదవారం జరిగింది. ఎస్ఐ రామస్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కుమ్మరిగుంటకు చెందిన ధనశేఖర్ (58) భార్య ఐదేళ్ళ క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పట్నుంచి ధనశేఖర్ తాగుడుకు బానిసయ్యాడు. ఈక్రమంలో కొంతకాలంగా ఇతడి ఆరోగ్యం క్షీణించింది. భార్య వియోగంతో తీవ్ర మనస్తాపం చెందిన ధనశేఖర్ మంగళవారం రాత్రి పురుగుమందు తాగి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలిండియా కరాటే చాంపియన్‌షిప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు

తిరుపతి(క్రీడలు), జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో ఆగస్టు 17న సిద్ధార్థ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2025 పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కరాటే దూ అసోసియేషన్ ప్రెసిడెంట్ నల్లూరి మోహన్‌రావు, నవీన్ మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు, కేఐవో ఏపీ ఆర్గనైజింగ్ కమిషన్ మెంబర్ పి.నవీన్, అకాడమీ ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు పాల్గొన్నారు.

మలబార్‌లో వరలక్ష్మీవ్రతం ఆఫర్లు

తిరుపతి అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో ప్రత్యేక ఆఫర్లు ప్రవేశపెట్టినట్లు షోరూం హెడ్ రిజీష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని రకాల బంగారు, అన్కట్ వజ్రాలు, రత్నాభరణాలకు సంబంధించి తరుగు చార్జీలపై 30శాతం, అలాగే వజ్రాల విలువపై 30శాతం తగ్గింపు వచ్చేనెల 8తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరాధనలకు ప్రామాణికం.. కశ్యప మహర్షి జ్ఞానకాండ గ్రంథం



నక్షత్రోత్సవంలో ప్రసంగిస్తున్న పండితులు

తిరుమల, జూలై30(ఆంధ్రజ్యోతి): కశ్యప మహర్షి అందించిన జ్ఞానకాండ గ్రంథం అసంఖ్యాక వైఖానస ఆలయాల్లో నిర్వహించే ఆరాధానలకు అత్యంత ప్రామాణికమని పండితులు పేర్కొన్నారు. తిరుమలలోని ఆస్థానమండపంలో శ్రీవైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ, టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం వైఖానస మహర్షి శిష్యుల్లో ఒకరైన కశ్యప మహర్షి తిరు నక్షత్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పండితులు ప్రసంగిస్తూ కశ్యప మహర్షి అందించిన జ్ఞానకాండ గ్రంథం ఆలయ నిర్మాణానికి, భూ పరీక్ష, శంకు స్థాపన, ఆలయ నిర్మాణ శైలి, మండపం నిర్మాణం, విగ్రహ నిర్మాణం, ప్రతిష్ఠా విధానాలు వంటి సమగ్ర జ్ఞానం సమాజానికి అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఖానస సభ కార్యదర్శి శ్రీనివాస దీక్షితులు, విఖానస ట్రస్టు కార్యదర్శి ప్రభాకారాచార్యులు, వేదవిజ్ఞానపీఠం పండితులు శ్రీనివాస దీక్షితులు, టీటీడీ పురాణ పండితులు వాకాణి రామకృష్ణ శేషసాయి, వేదవిజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర పండితులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం



ఎస్.బాదుల్లా



జి.వాసు

తిరుపతి(ఆటోనగర్), జూలై30(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆటో యూనియన్ (సీఐటీయూ అనుబంధం) నగర కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.బాదుల్లా, ప్రధాన కార్యదర్శిగా జి.వాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాయత్రి, ఉపాధ్యక్షులుగా రాము, రవి, కుమార్, మురుగ, సహాయ కార్యదర్శులుగా ప్రసాద్, హేమాద్రి, మంజునాథ్, కార్యవర్గ సభ్యులుగా సాయి, వెంకటరెడ్డి, టి.మురళి, రమణ, దేవరాజులు, ప్రకాష్ యాదవ్, గోపి, ఈరన్న, సుధాకర్, రామకృష్ణ, చంద్ర, రమణానాయక్, కె.మురళి, ఢిల్లీ, చందు, ప్రతాప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

తిరుపతి(విద్య), జూలై 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పెన్షన్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 20 ఏళ్ల గడుస్తున్నప్పటికీ 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం శోచనీయమని పేర్కొన్నారు. తెలంగాణలో ఇదే కేటగిరీకి చెందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని కోరారు.

జీఎస్ఎల్వీ ఎఫ్16 విజయవంతంపై సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న కూటమి నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇస్రో చేపట్టిన జీఎస్ఎల్వీ ఎఫ్16 రాకెట్ ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో నగరంలో కూటమి నాయకులు, స్థానికులు సంబరాలు చేసుకున్నారు. బుధవారం స్థానిక ఘంటసాల కూడలిలో జాతీయ పతాకాలు చేతబట్టి భారత్ మాతాకీజై అంటూ నినాదాలు చేశారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందం పంచుకున్నారు. నిసార్ ఉపగ్రహ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన ఇస్రో శాస్త్రవేత్తలకు జేజేలు పలికారు. సింగంశెట్టి సుబ్బరామయ్య, గోపినాథ్‌రెడ్డి, మస్తాన్, జయంతికుమార్, జగదీష్, నాన్నయ్య ఆచారి, కేశవులు, సుబ్రహ్మణ్యం రెడ్డి, సిద్ధేంద్రశర్మ, కోటేశ్వరరావు, సునీల్, కుమారస్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జూలై 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ మంగళం రూరల్ సెక్షన్ల పరిధిలో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న కారణంగా గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ, గంగాదేవి కాలనీ, పీఎస్ఆర్ గార్డెన్స్, రామచంద్రనగర్ సమీప ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.



సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబు నాయుడిని కలిసిన తిరుపతి వాసి రావిళ్ల పల్లవి తదితరులు

ప్రత్యామ్నాయం చూపకనే..
బస్టాండును కూల్చడమా?



కూలుస్తున్న భవనం కిందనే తిరుగుతున్న ఉద్యోగులు, ప్రయాణికులు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే సెంట్రల్ బస్టాండును కూలగొడుతుండటం విమర్శలకు తావిస్తోంది. శ్రీహరి బస్టాండులోని 6వ ప్లాట్‌ఫామ్ వరకు బిల్డింగ్ పాడైపోయి సీలింగ్ పెచ్చులూడుతోంది. స్పందించిన అధికారులు నిపుణులతో అధ్యయనం చేయించారు. కూల్చేయడం శ్రేయస్కరమని వారు నివేదిక ఇచ్చారు. కూల్చే ముందు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ క్రమంలో కూల్చేందుకు, తాత్కాలిక షెడ్డు నిర్మాణానికి వేర్వేరుగా టెండర్లను ఖరారు చేశారు. అయితే ఏటీఎం ఆఫీసు, కార్గో, రిజర్వేషన్ కౌంటర్లను మరొకచోటుకు తరలించకుండానే గోడలను కూల్చడం ప్రారంభించారు. పనులు జరుగుతున్నాయని గుర్తుగా గ్రీన్‌మ్యాట్‌ను చుట్టూ ఏర్పాటు చేసినా లోపలిభాగంలో ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రిజర్వేషన్ కౌంటర్లు, కార్గో సెంటర్‌కు ప్రయాణికులు తిరుగుతూనే ఉన్నారు. అంతేగాక ప్లాట్‌ఫామ్స్ పైభాగంలో పిట్టగోడను తొలగిస్తుండగా కిందిభాగంలో అక్కడక్కడా పెచ్చులూడిపోతోంది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంలో ఆర్టీసీ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనబడుతోంది. ఇప్పటికైనా స్పందించి ముందుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని తర్వాత కూల్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిమజ్జనం రోజున మద్య నిషేధం విధించండి



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30(ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక నిమజ్జనం రోజున మద్య నిషేధం విధించాలని తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కమిటీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. సామంచి మాట్లాడుతూ ఆగస్టు 27న వినాయక చవితిని పురస్కరించుకుని నగరంలో సుమారు వెయ్యి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 31న నిమజ్జనం ఉం టుందని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని అలాగే ఆ రోజున ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా మద్య నిషేధం విధించాలన్నారు. కమిటీ సభ్యులు ఆర్సీ మునికృష్ణ, శ్రీనివాస్, సతీష్, గోపినాథ్, చెన్నం నవీన్, పార్థు, రెడ్డిబాబు, ఆనంద్, వాసు, భాస్కర్‌నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ విద్యా సంస్థల్లో హాస్టల్ సీట్లు పెంచండి



జేఈవోతో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ విద్యాసంస్థల్లో హాస్టల్ సీట్లను పెం చి నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు రాపూరి ప్రసాద్‌బాబు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మంను కోరారు. ఈ మేరకు దళిత సంఘాల నాయకులతో కలిసి బుధవారం జేఈవోకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ టీటీడీ విద్యాసంస్థల్లో సీట్లు పొందిన విద్యార్థుల్లో చాలామందికి హాస్టల్ సీట్లు లభించడం లేదన్నారు. ముఖ్యంగా ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో సమస్య అధికంగా ఉందని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. మాల మహానాడు నాయకులు కల్లూరు చెంగయ్య, మాదిగ జనసైన్యం సుధాకర్, భారతీయ దళితవిద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు యుగంధర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా దుకాణాల వేలం

తిరుపతి, జూలై30(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలకు కమిషనర్ ఎన్.మౌర్య సమక్షంలో బుధవారం బహిరంగ వేలం పాట ప్రశాంతంగా నిర్వహించారు. కరంబాడి మార్గంలోని వినాయక సాగర్ వద్ద గల దుకాణ సముదాయం, వినాయకసాగర్ పార్కింగ్, ప్రవేశ రుసుం, గేమ్ జోన్, లీలామహల్ వద్ద గల షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదులు, ఇందిరా మైదానంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇందిరాప్రియదర్శిని కూరగాయల మార్కెట్లోని దుకాణాలకు, శ్రీనివాసం ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. కాగా వినాయకసాగర్ పార్కింగ్, ప్రవేశ రుసుం, గేమ్ జోన్ వేలం వాయిదాపడింది. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లోని దుకాణాలకు, శ్రీనివాసం ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు, వైకుంఠపురం మార్కెట్లోని దుకాణాలకు నిర్వహించిన వేలంలో ఎవ్వరూ పాల్గొనలేదు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అధికారులు సేతుమాధవ్, రవి, ఆర్ఐలు పాల్గొన్నారు.

మహిళల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



కరపత్రాన్ని విడుదల చేస్తున్న డీఎస్పీ శ్రీలత తదితరులు

తిరుపతి (విశ్వ విద్యాలయాలు), జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహి ళల అక్రమ రవాణాకు పూర్తి స్థాయిలో అడు కట్ట వేయడానికి ప్ర భుత్వం కృషి చేస్తోందని డీఎస్పీ శ్రీలత పేర్కొన్నారు. మహిళా అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్వీయూ ఉమెన్ స్టడీస్ విభాగంలో ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనేక మంది మహిళలు అక్రమ రవాణాకు గురై, పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమాజంలో ఇది తీవ్ర దురాచారంగా మారిందని, దీనికి అడ్డుకట్ట పూర్తి స్థాయిలో పడాలని అన్నారు. అవగాహనతో ఈ లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయపడ్డారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రగతి సంస్థ నిర్వాహకులు రమణ, ఉమెన్ స్టడీస్ హెడ్ సాయి సుజాత, సంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెటర్నరీ ఎఫ్ఏసీ రిజిస్ట్రార్‌గా శ్రీలత

తిరుపతిరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి) : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఎఫ్ఏసీ రిజిస్ట్రార్‌గా డాక్టర్ సీహెచ్ శ్రీలతను నియమిస్తూ బుధవారం వర్సిటీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు వెలువరించారు. ప్రస్తుత రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్ గురువారం ఉద్యోగ విరమణ చేయనుండడంతో వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీలతకు ఆ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వచ్చేనెల ఒకటి నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పదవిలో కొనసాగుతారు.

బీసీ హాస్టల్ పరిశీలన

తిరుపతి రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తాటితోపులోని ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహాన్ని వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి బుధవారం రాత్రి పరిశీలించారు. వార్డెన్ శ్రీదేవితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన విభాగం కొనసాగింపు



ఉత్తర్వులతో వీసీ ఉమ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో ఏర్పాటైన శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధనా విభాగాన్ని 2025-26 విద్యా సంవత్సరం కూడా పొడిగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ విభాగం ద్వారా నూతన ఆవిష్కరణలతో కూడిన సంస్థలకూ, వ్యక్తులకూ రూ.2 నుంచి 10 లక్షల నిధులు మంజూరు చేసే అధికారం ఈ సంస్థకు ఉంది. ఈ విభాగానికి కో-ఆర్డినేటర్‌గా జ్యోత్స్నా, కో కో-ఆర్డినేటర్‌గా సుజాత వ్యవహరిస్తున్నారు. ఈ విభాగానికి మరో ఏడాది పాటు కాల పరిమితిని పొడిగించడం పట్ల వీసీ ఉమ హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందిన ఘటన స్థానిక బాలాజీ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. యూనివర్సిటీ ఎస్ఐ కృష్ణయ్య వివరాల మేరకు శ్రీకాకుళానికి చెందిన శీను(46) జీవనోపాధి నిమిత్తం కుటుంబంతోపాటు 10 రోజుల క్రితం తిరుపతికి వలస వచ్చాడు. బాలాజీ కాలనీలోని ముస్కాన్ బాషా ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. అక్కడ భార్య బాలతో పాటు కూలి పనికి చేరాడు. బుధవారం సెంట్రింగ్ పనిచేసుకుని బోరు మోటరు వేయడానికి వచ్చాడు. మోటరుకు పైపు బిగిస్తుండగా విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణయ్య కేసు నమోదు చేశారు. శీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

డ్రైనేజీల్లో నీరు నిలవకుండా చర్యలు



డ్రైనేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై30(ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ కాలువల్లో మురుగునీరు నిల్వకుండా చెత్త తొలగించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం 31వ వార్డులోని బొమ్మగుంట ప్రాంతాల్లో కార్పొ రేటర్ రేవతి, అధికారులతో కలసి ఆమె పారిశుధ్య పనులను పరిశీలించారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాపిస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టి, దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు సరైన సమయంలో సరఫరా చేయాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, డీసీపీ ఖాన్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి అందిస్తున్న ఎంఈవో-2 శంకరయ్య, గ్రామ యువత

తిరుపతిరూరల్, జూలై30(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లె మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన యువత హరీష్, లడ్డు, భార్గవ్, మునీశ్వరయాదవ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యాసామగ్రి అందజేశారు. ఎంఈవో-2 శంకరయ్య చేతులమీదుగా విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు, నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, ఎరేజర్లు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు చేయూతనందించేందుకు గ్రామానికి చెందిన యువత ముందుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. హెచ్ఎం మాలతీదేవి, టీచర్లు చిట్టిబాబు, సునీత తదితరులు పాల్గొన్నారు.



సైకిల్‌పై శాంతి యాత్ర

● 60ఏళ్ల వృద్ధుడి సాహసం

వందల కిలోమీటర్లు తిరిగి పాతపడ్డ సైకిల్! దాని ముందూ, వెనుక లగేజీ బ్యాగులు! సైకిల్ చుట్టూ హిందీ, ఇంగ్లీషు భాషలో రాసిన బోర్డులు! ఓ 60 ఏళ్ల వృద్ధుడు గిరిగిరామంటూ తిరుపతిలో ఆ సైకిల్ తొక్కుతూ జోరుగా వెళుతున్నారు. అతడిని ఆపి పలకరిస్తే ఆసక్తికర విషయాలు చెప్పారు.

కర్నాటక రాష్ట్రం హసన్ జిల్లాకు చెందిన నాగరాజ్ గౌడ్ సైకిల్ యాత్ర ద్వారా దేశం చుడుతున్నారు. పదో తరగతి మాత్రమే చదివిన ఆయన కన్నడ, హిందీ, తెలుగు, తమిళ్, హిందీ, ఇంగ్లీషు భాషలు అనర్గళంగా మాట్లాడుతున్నారు. కన్నడలో జూనియర్ ఆర్టిస్టుగా అనేక సినిమాల్లో నటించారు. పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్‌గా ఉండిపోయారు. భవబంధాలకు దూరమై ఏక్‌నిరంజన్‌గా మారినతర్వాత విశ్వశాంతికోసం సైకిల్ యాత్ర చేయాలనుకున్నాడు. 'ప్రపంచ శాంతి, సహజ వనరుల పరిరక్షణ, మనుషులంతా ఒక్కటే, సమైక్యతపై ప్రజలలో అవగాహన పెంచేందుకు భారతదేశ యాత్ర చేస్తున్నా. 2017 డిసెంబరులో ముంబై నుంచి యాత్ర మొదలుపెట్టా. కరోనా



సమయంలో రెండేళ్లు నిలిపివేశా. మళ్లీ మొదలుపెట్టా. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హరియాణా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, యూపీ, మధ్యప్రదేశ్, బిహార్, జార్ఖండ్, వెస్ట్‌బెంగాల్, తెలంగాణ మీదుగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో యాత్ర కొనసాగుతోంది. రోజుకు 60 నుంచి 80 కి.మీ ప్రయాణం చేస్తా. ఆలయాలు, ఆశ్రమాల వద్ద రాత్రి బస చేస్తా. దారిన కనిపించే దాతలు ఇచ్చే ఆర్థికసాయంతో దారి ఖర్చులు పెట్టుకుంటా. యాత్రలో భాగంగా ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిశా. మరో రెండేళ్లలో దేశవ్యాప్త యాత్ర ముగుస్తుందని అనుకుంటున్నా' అని అన్నారు నాగరాజ్ గౌడ్.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.89 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,183

తలనీలాలు సమర్పించినవారు: 25,906



అమ్మో.. గజరాజులు

● భయం గుప్పెట్లో సత్యసాయి ఎస్టీ కాలనీ వాసులు ● మామిడి చెట్ల ధ్వంసం

చంద్రగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నరసింగాపురం పంచాయతీ సత్యసాయి ఎస్టీ కాలనీ ప్రాంతంలో మళ్లీ ఏనుగులు సంచరించాయి. రెండు రోజులుగా ఏనుగులు సంచరిస్తుండటంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి 11 ఏనుగుల గుంపు శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు మార్గంలో హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. మళ్లీ మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ఏనుగుల గుంపు సత్యసాయి ఎస్టీ కాలనీ సమీపంలోని మేడసాని ఆనందనాయుడు మామిడి తోటలోకి వచ్చాయి. ఐదు మామిడి చెట్లను విరిచేశాయి. పక్కనే ఉన్న చెంచయ్య వరిపైరునూ తొక్కి నాశనం చేశాయి. సమాచారం అందుకున్న అటవీ అధికారులు తమ సిబ్బందితో వెళ్లి డ్రోన్ సాయంతో ఏనుగుల గుంపును గుర్తించి కాలనీలలో రాకుండా అటవీ సిబ్బంది బాణసంచా పేల్చారు. బుధవారం ఉదయం 6.30 గంటల సమయంలో ఏనుగులు మళ్లీ శేషాచలం అడవుల్లోకి వెళ్లిపోవడంతో అటవీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఏనుగుల గుంపు శేషాచలం అటవీ ప్రాంత సమీపంలో సంచరిస్తుండటంతో ఇప్పటికే నాగపట్ల రేంజ్ ఫారెస్ట్ అధికారులు మండలంలోని శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, నరసింగాపురం పంచాయతీలోని సత్యసాయి ఎస్టీ కాలనీ, రామిరెడ్డిపల్లె పంచాయతీలోని వైకుంఠపురం ఎస్టీ కాలనీ, ఎ.రంగంపేట పంచాయతీలోని ఎంబీయూ విద్యాసంస్థ ప్రాంతం, రాగిమాకుల ఎస్టీ కాలనీ, దుర్గం ఎస్టీకాలనీలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ సిబ్బంది సూచిస్తున్నారు. ఈ ప్రాంతాల ప్రజలు, అటవీ సిబ్బంది సంయుక్తంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఏదైనా ఏనుగుల సంచారం, కదలికలు, ఉంటే తమకు వెంటనే సమాచారం అందించాలని అధికారులు కోరారు.



సత్యసాయి ఎస్టీ కాలనీ సమీపంలో వచ్చిన ఏనుగులు

'జూనియర్' మొక్కు చెల్లించుకున్నా

● తిరుమలలో హీరో గాలి కిరీటిరెడ్డి

తిరుమల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 'జూనియర్ సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుని ఆశీర్వదించమని మొక్కుకున్నా. ప్రేక్షకులు సినిమాను ఆదరించారు. మొక్కు చెల్లించుకోవడానికి మళ్లీ వచ్చా' అని హీరో గాలి కిరీటిరెడ్డి తెలిపారు. తన తండ్రి, పారిశ్రామికవేత్త గాలి జనార్దన్‌రెడ్డి, ఇతర కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. రెండువారాల్లో తన తర్వాతి సినిమాను ప్రకటిస్తామన్నారు. ప్రముఖ హీరోలు పునిత్ రాజ్‌కుమార్, జూనియర్ ఎన్టీఆర్ తనకు ఎంతో స్ఫూర్తినిచ్చారని చెప్పారు. తన కుమారుడు కిరీటి చిన్నప్పటి నుంచే కళాకారుడని గాలి జనార్దన్‌రెడ్డి తెలిపారు.



గాలి జనార్దన్ రెడ్డి, కిరీటి రెడ్డి



లక్ష్మీభారతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, అమరనాథరడ్డి, గురజాల జగన్మోహన్ తదితరులు



నానీని పలకరిస్తున్న చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు

పులివర్తి లక్ష్మీభారతికి ప్రముఖుల నివాళి

పాకాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లి, పులివర్తి లక్ష్మీభారతికి పలువురు ప్రముఖులు, అధికారులు నివాళులు అర్పించారు. పాకాల మండలం పులివర్తివారిపల్లెలో బుధవారం జరిగిన లక్ష్మీభారతి కర్మక్రియలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, పరిసర గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, గురుజాల జగన్మోహన్, డాక్టర్ కలికిరి మురళీమోహన్, గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, భాష్యం ప్రవీణ్, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డీసీసీబీ అధ్యక్షుడు అమాస రాజశేఖర్ రెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, ఏఎస్పీ రవి మనోహరాచారి, టీడీపీ నాయకులు దొరబాబు, సీఆర్ రాజన్, చంద్రప్రకాష్‌నాయుడు, వలపల దశరథనాయుడు, చంద్రగిరి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై లక్ష్మీభారతికి నివాళులు అర్పించారు.

మహిళల ఉచిత ప్రయాణం

అమలుకు సిద్ధంగా ఉన్నాం



పూల నాగరాజు - దిల్‌రాజు, అశోక్ - అశ్విని

తిరుమల, జూలై30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ రాయలసీమ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ పథకానికి సంబంధించి ఇప్పటికే ఆర్టీసీ అధికారులతో సీఎం సమీక్షించారన్నారు. మహిళలు గౌరవంగా, సౌకర్యవంతంగా ప్రయాణించేలా సీఎం అనేక సూచనలు చేశారన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలోని మరుగుదొడ్లు, తాగునీటి కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. అలాగే, సినీ నిర్మాత దిల్ రాజు, నటుడు అశోక్, సీఎం ప్రోగ్రాం అడ్వైజర్ పి.వెంకటేష్, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సమంత్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, కన్నడ సినీనటుడు పునీత్‌రాజ్‌కుమార్ సతీమణి అశ్విని ఉన్నారు.

హేళనగా చూస్తున్నారు..!

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ల ఎదుట విలపించిన విద్యార్థినులు



వసతి గృహంలో విద్యార్థినులను విచారిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పూడిమిట్ల కుమారి

కోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఘటనపై సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు హేళనగా చూస్తున్నారు.. సహచర విద్యార్థినులతో కలసిపోదామంటే అంగీకరించడం లేదు.. పాఠశాలకు వెళ్లాలంటే భయమేస్తుందని ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థులు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ల ఎదుట విలపించారు. కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్ వసతిగృహం విద్యార్థినులను యూనిఫాం వేసుకొని రాలేదన్న కారణంగా బెత్తంతో కొట్టి గుంజీళ్లు తీయించిన విషయం తెలిసిందే. దీనిపై విచారించిన డీఈవో కేవీఎన్ కుమార్ వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్‌ను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు పూరిమిట్ల కుమారి, యుగంధర్ పొన్న కోటలోని వసతిగృహంలో విచారణ చేపట్టారు. అలాగే తిరుపతి పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి, అసెంబ్లీ కమిటీ సభ్యురాలు పోలమ్మ, పార్లమెంట్ కార్యదర్శి భారతి, మాజీ జడ్పీటీసీ ప్రమీల, టౌన్ ప్రెసిడెంట్ గుండాల శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ కల్పన వసతిగృహంలో విద్యార్థినులను పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ యూనిఫాం వేసుకురాలేదని వ్యాయామ ఉపాధ్యాయుడు తమను దుర్భాషలాడుతూ కొట్టిన సంగతి వాస్తవమే అన్నారు. ఈ ఘటన జరిగిన తరువాత పాఠశాలలో ఎవరూ తమతో మాట్లాడటం లేదని కంటతడి పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాలకు వెళ్లాలంటే భయంగా ఉందని వాపోయారు.కాగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సమక్షంలో శుక్రవారం మళ్లీ విచారణ చేపడుతామని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు తెలిపారు. పూర్తి వివరాలను సీడీ, నివేదిక రూపంలో విద్యాశాఖమంత్రి లోకేశ్‌కు పంపుతామని చెప్పారు.



మాట్లాడుతున్న పీఎఫ్ కమిషనర్ వీరభద్రస్వామి

పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్‌పై అవగాహన

సత్యవేడు, జూలై 30: (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో అదనపు కేంద్ర పీఎఫ్ కమిషనర్ (ఏపీ) వీరభద్రస్వామి ఆధ్వర్యంలో బుధవారం పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్‌పై అవగాహన సదస్సు జరిగింది. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ ప్రోగ్రాంగా పిలిచే పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గతేడాది బడ్జెట్‌లో ఆమోదించింది. దీనిపై అవగాహన పెంచి పథకం సమర్థవంతంగా అమలయ్యేలా ప్రోత్సహించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని పీఎఫ్ కమిషనర్ తెలిపారు. తయారీ రంగంలో భారీగా ఉద్యోగాల సృష్టి, పరిశ్రమల యాజమాన్యాలు కొత్త ఉద్యోగులకు అందించే ఆర్థిక ప్రోత్సాహకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్లు రవితేజరెడ్డి(కడప), సతీష్‌కుమార్ (తిరుపతి), శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్)రమేష్ కుమార్, హెచ్‌ఆర్ ప్రతినిధి శివకుమార్, ఈపీఎఫ్‌వో ఉన్నతాధికారులు, వివిధ పరిశ్రమల హెచ్‌ఆర్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వలసపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయలో 6వతరగతిలో ప్రవేశానికి డిసెంబరు 13న జరిగే ఎంపిక పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గీత తెలిపారు. ఆగస్టు 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడవు పొడించినట్లు ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో విద్యార్థులు నివాసం ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 89199 56395, 70132 01138 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నరసాపూర్- బెంగళూరు ప్రత్యేక రైలు దారిమళ్లింపు

● అరక్కోణం జంక్షన్ వద్ద ఇంటర్ లాకింగ్ పనులతో తిరుపతి మీదుగా రాకపోకలు

తిరుపతి(సెంట్రల్), జూలై 30 (ఆంధ్రజ్యోతి): నరసాపూర్- బెంగళూరు ప్రత్యేక రైళ్లు (07153- 07154) ఆగస్టు ఒకటి నుంచి సెప్టెంబరు 27వ తేది వరకు తిరుపతిమీదుగా నడవనున్నాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. 'ఈ ప్రత్యేక రైళ్ళు రేణిగుంట, తిరుత్తణి, మేల్‌పాకం, కాట్పాడి మీదుగా రాక పోకలు సాగించేవి. అరక్కోణం రైల్వే జంక్షన్ సమీపంలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న కారణంగా దారి మళ్లించారు. తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి మీదుగా బెంగళూరుకు రాక పోకలు సాగిస్తాయి. నరసాపూర్‌లో బయలుదేరి తిరుపతికి తెల్లవారుజామున 3.38 గంటలకు చెరుకొని.. 3.43 గంటలకు తిరిగి బెంగళూరుకు బయలుదేరుతుంది. బెంగళూరు నుంచి వచ్చేటప్పుడు తిరుపతికి సాయంత్రం 5.30 గంటలకు చేరుకొని 5.35 గంటలకు బయలుదేరుతుంది' అని ప్రకటనలో పేర్కొన్నారు.

పద్మావతి పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు



ఉత్తర్వులతో టీటీడీ ఈవో శ్యామలరావు, ప్రిన్సిపాల్ పద్మావతమ్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌కి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. గత నెలలో ఎన్‌బీఏ బృందం ఈ కాలేజీలో పర్యటించింది. విద్యార్థులు, ఉద్యోగులు, లైబ్రరీ, ల్యాబ్ తదితర సదుపాయాలు, ప్రమాణాలను పరిశీలించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతమ్మ, అధ్యాపకులను టీటీడీ ఈవో శ్యామలరావు అభినందించారు. ఈ కాలేజీ మరింత ఉన్నత గుర్తింపును సంతరించుకోవాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు.

రెడ్ శ్యాండిల్ కోర్టు స్పెషల్ పీపీ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), జూలై 30(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఏర్పాటు చేసిన రెడ్ శ్యాండిల్ కోర్టు న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అమరనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ లీగల్ అధ్యక్షుడిగా పనిచేశారు. తాజాగా ప్రభుత్వం ఈయన్ను రాష్ట్ర ఎర్రచందనం కోర్టుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించడంతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తగు సాక్ష్యాధారాలతో ఎర్రచందనం స్మగ్లర్లకు కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తానని ఆయన చెప్పారు.

బ్యాంకర్లూ.. భద్రతా చర్యలు తీసుకోండి

● 'హిందూపురం' ఘటనతో అప్రమత్తం చేస్తున్న పోలీసులు



బ్యాంకు అధికారితో మాట్లాడుతున్న అలిపిరి ఎస్ఐ అజిత

తిరుపతి(నేరవిభాగం), జూలై 30(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో జరిగిన బ్యాంకు దోపిడీ ఘటనతో తిరుపతి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా బుధవారం పోలీసు అధికారులు బృందాలుగా అన్ని బ్యాంకుల అధికారులు, ఉద్యోగులతో మాట్లాడి అప్రమత్తం చేశారు. ప్రతి బ్యాంకు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పూర్తి సామర్థ్యంతో సెక్యూరిటీ ఉండాలని సూచించారు. అనుమానితులు బ్యాంకుల వద్ద తిరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సీఐలు శ్రీనివాసులు, రాంకిషోర్, మురళీమోహన్, రామయ్య, ఎస్ఐలు తమ పరిధిలోని బ్యాంకుల వద్దకు వెళ్లి భద్రతకు సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చారు. రానున్న వారం రోజుల్లో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ నియామకాలు పూర్తిచేసి మీ బ్యాంకులకు మీరే భద్రత ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

నలుగురు దొంగల ముఠా అరెస్టు

● పరారీలో మరో ఇద్దరు

● రూ.20.4 లక్షల నగలు, రెండు బైకులు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 30 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పోలీసులు బుధవారం కరుడుగట్టిన నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేశారు. ఈ వివరాలను తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం నామక్కల్ జిల్లా సేరిక్కులై గ్రామానికి చెందిన ఎం.మణి అలియాస్ కోవిల్‌మణి, ఎం.సురేష్ స్నేహితులు. వీరు తమిళనాడుతో పాటు పలు ప్రాంతాల్లో ఇంటి దొంగతనాలకు పాల్పడేవారు. అలాగే, తిరుపతి నగరం మంగళం పరిధిలోని తిరుమల నగర్‌కు చెందిన స్నేహితులు కుమార్, మణికంఠ చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. అయితే వీరు గతంలో తమిళనాడులో దొంగతనాలు చేసి వేలూరు జైలులో ఉండగా, తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితులతో పరిచయమైంది. ఆ తర్వాత ఈ నలుగురూ కలిసి కొన్నేళ్ళుగా తమిళనాడుతో పాటు ఏపీలోని పలు జిల్లాల్లో ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల నెల్లూరులోని పలు ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో నెల్లూరు పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, వేలిముద్రలు పరిశీలించారు. వీరు చంద్రగిరి, పుత్తూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఇళ్ల తాళాలు పగులకొట్టి బంగారు నగలు అపహరించుకుని వెళ్లారు. ఈనెల 15న ఏర్పేడు పోలీసు స్టేషన్ పరిధిలో ఇంటి ముందు నిలిపిన బైకును దొంగలించి నెల్లూరు వెళ్లారు. అక్కడ నవాబ్‌పేటలో ఇంటి ముందు ఆపి వున్న మరో ద్విచక్ర వాహనాన్ని దొంగలించారు. ఈ రెండు మోటారు సైకిళ్లలో తిరుగుతూ పగటి పూట రెక్కీ నిర్వహించి రాత్రి పూట ఇంటి దొంగతనాలకు పాల్పడేవారు. ఈ కేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగల కోసం వేట మొదలు పెట్టారు.

క్రైం అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో..

పుత్తూరు, ఏర్పేడు, చంద్రగిరి, గాజులమండ్యం పరిధిలోని పెనుబాల కళాశాలలో జరిగిన దొంగతనం కేసుల్లో నిందితులను పట్టుకోవడానికి ఎస్పీ హర్షవర్ధనరాజు తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ నేతృత్వంలో తిరుపతి క్రైం సీఐలు ప్రకాష్, శివకుమార్ రెడ్డి, రూరల్ సీఐ రవీంద్ర, పుత్తూరు, కేవీబీ పురం, పిచ్చాటూరు ఎస్ఐలు ఓబయ్య, నరేష్, వెంకటేష్‌లతో పాటు జిల్లా క్రైం పార్టీలు దాము, నాగరాజు, రమేష్, మోహన్, రాజశేఖర్, భారుష, రవిప్రకాష్, మోహన్, మునిరత్నంను బృందాలుగా ఏర్పాటు చేశారు. వీరు పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో బుధవారం పుత్తూరు- చెన్నై హైవేలోని సిరుగురాజుపాలెం సమీపంలో మురుగన్‌గుడి వద్ద నలుగురు నిందితులు ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి దాదాపు రూ.20.40 లక్షల విలువ చేసే 190 గ్రాముల బంగారు నగలు, 2.3 కిలోల వెండి వస్తువులు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసుల్లో తమిళనాడు రాష్ట్రం చిదంబరానికి చెందిన ఎం.ప్రభు, వేలూరు జిల్లా అనైకట్టుకు చెందిన మణిగండన్ పరారీలో ఉన్నారు. కాగా, అరెస్టయిన వారిలో మణిపై 50, సురేష్‌పైన 15, కుమార్‌పై 18, మణికంఠపై 18 చొప్పున కేసులున్నాయి. ఈ కేసుల్లో ప్రతిభ కనపరచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు.



పుత్తూరు పోలీసులు రికవరీ చేసిన నగలు, వెండి వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ

హోటళ్లు, ఐస్‌క్రీమ్ పార్లర్లకు జరిమానాలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించిన పలు హోటళ్లు, ఐస్‌క్రీమ్ పార్లర్లకు జరిమానా విధించినట్లు జేసీ శుభం బన్సల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో ఓ ఐస్‌క్రీమ్ పార్లర్‌కు రూ.50వేలు, రెస్టారెంట్లు,డాబాలకు రూ.1.15లక్షలు, సరైన లేబుల్ వివరాలు లేకుండా వాటర్ బాటిల్ విక్రయించినందుకు రూ.30వేలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థకు రూ.30వేలు, నాణ్యత లేని నెయ్యి విక్రయించినందుకు రూ.15వేలు, ఓ బేకరికి రూ.15వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. వివిధ ఆయిల్ సాల్ట్ ప్యాకెట్‌పై వినియోగదారులను తప్పుదోవ పట్టించిన వివరాలు ముద్రించిన సంస్థకు రూ.2లక్షలు, కాలపరిమితి ముగిసిన ఆహారపదార్థలను ఉంచినందుకు వ్యాపారికి రూ.15వేలు, ఇలా 20 కేసులకు సంబంధించి 4.92లక్షలు జరిమానా విధించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పుత్తూరు వార్తలు

ఇంటిపన్నులపై ప్రత్యేక కమిటీ

● కౌన్సిల్‌లో మున్సిపల్ కమిషనర్ వెల్లడి


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మెన్ హరి, కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టలేదని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు సమస్యలను ఏకరవు పెట్టారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని కోరారు. రోడ్లు, కాలువలు, నీటి సరఫరా పైప్‌లైన్ల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కౌన్సిల్‌లో నిర్ణయించారు. కౌన్సిలర్ ఏకాంబరం ప్రస్తావించిన అంశంపై కమిషనర్ మంజునాథ్ గౌడ్ స్పందిస్తూ ఇంటింటికి తిరిగి పన్ను విషయంలో సమగ్రంగా విచారించనున్నట్లు తెలిపారు. ఇందుకు కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నపాటి వీధుల్లో కాలువల నిర్మాణం కష్టమన్నారు. అండర్ డ్రైనేజ్ వ్యవస్థతో పారిశుధ్య సమస్య పరిష్కారమవుతుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో దేశంలో మున్సిపాలిటీ 500 స్థానంలో నిలవడమే పురోగతికి నిదర్శనమన్నారు. ధర్మరాజుల స్వామివారి బ్రహ్మోత్సవాలకు మున్సిపాలిటీ తరఫున సారె సమర్పిస్తామని ఛైర్మెన్ హరి, వైస్ ఛైర్మెన్ జయప్రకాష్‌లు చెప్పారు. కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకారం

పుత్తూరు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ పాలకమండలి గురువారం కొలువుదీరనుంది. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భానుప్రకాష్ హాజరు కానున్నారు. ఉదయం 10 గంటలకు కార్వేటినగరం రోడ్డులోని అంబేడ్కర్, ఎన్టీఆర్, ముద్దుకృష్ణనాయుడుల విగ్రహాలకు ఏఎంసీ ఛైర్మెన్ డి.ఎస్.గణేష్, ఇతర పాలకమండలి సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం రాష్ట్ర పద్మశాలి, వన్నెకుల క్షత్రియ సంఘం డైరెక్టర్లు గంజి మాధవయ్య, షణ్ముగరెడ్డిలతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు ర్యాలీగా మార్కెట్ యార్డుకు చేరుకుంటారు. 11.10 గంటలకు పాలకమండలి బాధ్యతలు స్వీకరిస్తుంది.

1 నుంచి కొత్త పెన్షన్ల పంపిణీ : భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 703 కొత్త పెన్షన్‌లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న స్పౌజ్ కేటగిరీ, వితంతు, డయాలసిస్ పెన్షన్‌లను తక్షణం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దేశంలోనే సామాజిక భద్రత పెన్షన్‌లు రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేలు పెన్షన్‌లు అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడుకు, కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కొత్త పెన్షన్లు ప్రాంతాల వారీగా పుత్తూరు మున్సిపాలిటీ -131, పుత్తూరు మండలం -67, వడమాలపేట మండలం -86, నింద్ర మండలం - 88, నగరి మున్సిపాలిటీ - 118, నగరి మండలం - 104, విజయపురం మండలం - 109.

ఇద్దరికి ఏఎంసీ పదవులు


లీలావతి- దామోదరం

వడమాలపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో మండలం నుంచి ఇద్దరు నియమితులయ్యారు. కాయంపేటకు చెందిన పూజారి లీలావతి వైస్ ఛైర్మన్‌గా, టీసీ అగ్రహారానికి చెందిన కాసి దామోదరం డైరక్టర్‌గా నియమితులయ్యారు. వీరు గురువారం ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు దామురుాదవ్ చెప్పారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గంగమ్మ సేవలో ఎమ్మెల్యే భాను



పుత్తూరు టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పురంలో గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, టీడీపీ నాయకులు పాల్గొని గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలికి సన్మానించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంజి మాధవయ్య, మోహన్‌రాజు, మహేష్, బాలాజీ పాల్గొన్నారు. **పుత్తూరు:** కేబీఆర్‌పురంలో బుధవారం జరిగిన గంగమ్మజాతరలో గంగమ్మ తల్లిని మాజీ మంత్రి రోజా దర్శించుకున్నారు. మండల నాయకులు లోకనాథం, మునివేలు, మునస్వామిరెడ్డి పాల్గొన్నారు.

ద్రౌపదీ అమ్మవారికి క్షీరాభిషేకం


కలశాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

పుత్తూరు టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మరాజు తిరునాళ్ల సందర్భంగా బుధవారం ద్రౌపదిదేవికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు కలశాలతో పట్టణంలో ఊరేగింపుగా వచ్చి వినాయక, కుమారస్వామిలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సాల్వాకం ఎలుమలై, రాజమహేంద్ర, యుగందర్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా మహేష్

పుత్తూరు టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల కార్యదర్శిగా డి.మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పుత్తూరు అంబేడ్కర్ భవనం లో జరిగిన ప్రతినిధుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా 13 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

పుత్తూరు అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్‌ను డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్ బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం, నాటుసారా తదితర అంశాలలో నమోదైన కేసుల వివరాలను ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్ నుంచి ఆరా తీశారు. మద్యం దుకాణాలలో నియమ నిబంధనలు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐలు అంజాద్ భాషా, ఇతర సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు.

వెటర్నరీ ఎఫ్ఏసీ రిజిస్ట్రార్‌గా శ్రీలత

తిరుపతిరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి) : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఎఫ్ఏసీ రిజిస్ట్రార్‌గా డాక్టర్ సీహెచ్ శ్రీలతను నియమిస్తూ బుధవారం వర్సిటీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు వెలువరించారు. ప్రస్తుత రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్ గురువారం ఉద్యోగ విరమణ చేయనుండడంతో వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీలతకు ఆ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వచ్చేనెల ఒకటి నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆమె ఈ పదవిలో కొనసాగుతారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కోట, జూలై 30(ఆంధ్రజ్యోతి): కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 5వ తరగతిలో మిగులు సీట్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు కోరారు.

జాతర నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

వెంకటగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో సెప్టెంబరు 10, 11 తేదీల్లో నిర్వహించనున్న పోలేరమ్మ జాతరకు ఆగస్టు 5వ తేదీ టెండర్లు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయం పనివేళల్లో అధికారులను సంప్రదించాలని సూచించారు.

నేడు మున్సిపల్ సమావేశం

వెంకటగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ హాల్ అత్యవసర సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తెలిపారు. కౌన్సిలర్లు అందరూ హాజరు కావాలని కోరారు.

నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు

15 ఏళ్లుగా పైప్‌లైన్ మరమ్మతులు చేయని వైనం ● లక్షల రూపాయల వృథా


నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు - పగిలిపోయిన పైప్‌లైన్

ఓజిలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపరియ పంచాయతీ పరిధి పెద్దపరియరాజుపాళెంలో 2009లో అప్పటి ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ నిధుల నుంచి రూ.8 లక్షల వ్యయంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించింది. గ్రామానికి నీటి సరఫరా చేసేందుకు సమీపంలో ఓ బోరు వేసి దాని ద్వారా ట్యాంకుకు నీటిని నింపి పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసేవారు. కొద్ది కాలానికే ట్యాంకుకు నీటిని అందించే పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. దానికి మరమ్మతులు చేయకుండా నేరుగా ఇళ్లకు నీటిని సరఫరా చేసేలా అప్పట్లో చర్యలు తీసుకున్నారు. ఆ తరువాత కూడా పైప్‌లైన్‌ను బాగు చేయకుండా వదిలేశారు. దీంతో 15 ఏళ్లుగా ఓవర్‌హెడ్ ట్యాంకు నిరుపయోగంగా ఉంది. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తే ట్యాంకును నింపి ఇళ్లకు నీటి సరఫరా చేయొచ్చు. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఓవర్‌హెడ్ ట్యాంకును వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ డాక్టర్ నాగార్జునసాగర్

పెళ్లకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాయుడుపేట ఏడీఏ డాక్టర్ నాగార్జున సాగర్ కోరారు. బుధవారం మండలంలోని తాళ్వాయపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట పొలాలను పరిశీలించి ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఎకరానికి రూ.198 చెల్లించి బీమా నమోదు చేయించుకోవాలని సూచించారు. అదే విధంగా రైతులు తాము పండించే పంటల వివరాలను ఈ-క్రాప్ ద్వారా నమోదు చేయించుకోవాలని, తద్వారా పంటల బీమా, నష్టపరిహారం, గిట్టుబాటు ధర, వ్యవసాయ రుణాలు, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు తదితర పథకాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి విజయభారతి, ఏఈవో పుట్టయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల అందజేత

నాయుడుపేట టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం సంజయ్ గాంధీకాలనీలోని మేరీ వృద్ధాశ్రమానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గ్రేస్ బుధవారం నిత్యావసర సరుకులను అందజేశారు. తన జన్మదినం సందర్భంగా వృద్ధాశ్రమంలో కేక్ కట్‌చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. ఆశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకురాలు బెన్నీ సునీత, పాస్టర్ దయాకర్, షర్మిలా తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతిచెందిన షాహెరాభాను

గూడూరు అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో బుధవారం ఓ మహిళ అనుమానాస్పద మృతి చెందింది. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు.. ఇందిరమ్మ కాలనీలో నివాస ముంటున్న షాహెరాభాను(33) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేది. బుధవారం కాలనీ సమీపంలో షాహెరాభాను మృతి చెందివున్నట్లు స్థానికులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఆమె మృతికి కారణాలు విచారణలో తెలియాల్సి ఉందని ఎస్ఐ చెప్పారు.

సర్పంచ్ ఔదార్యం

తాగునీటి బోరుకు సొంతఖర్చుతో మోటరు ఏర్పాటు


బోరుకు మోటర్ అమర్చుతున్న సర్పంచు కోటయ్య తదితరులు

చిట్టమూరు, జులై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్టమూరు కొత్తగుంట గ్రామంలో తాగునీటి బోరు మోటరు వారం రోజుల క్రితం కాలిపోయింది. దీంతో తాగునీరు అందక కొత్తగుంట గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్‌కు తెలియజేసినప్పటికీ స్పందించలేదు. దీంతో సర్పంచ్ కోటయ్య సొంత డబ్బులతో కొత్త మోటరు కొనుగోలు చేసి గ్రామస్తుల సహకారంతో బోరుకు అమర్చారు.

పులివర్తి లక్ష్మీభారతికి నివాళి


లక్ష్మీభారతికి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లి లక్ష్మీభారతికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నివాళి అర్పించారు. పులివర్తిపాలెంలో బుధవారం జరిగిన సంతాపసభకు హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

వరదయ్యపాళెం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ సుధీర్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కారిపాకంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో ప్రతీ పౌరుడు స్వేచ్ఛగా జీవించేందుకు రాజ్యాంగం హక్కు కల్పించిందన్నారు. చట్టం అతిక్రమించకుండా ప్రతి ఒక్కరు చట్ట పరిధిలో జీవించాలన్నారు. డివిజనల్ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటి సభ్యుడు గుత్తి త్యాగరాజు ఆర్‌ఐ నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో వికృతమాల జగనన్న కాలనీ

శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వికృతమాల జగనన్న కాలనీ అంధకారంలో మగ్గుతోంది. ఈ కాలనీలో 900మందికి పట్టాలు ఇచ్చినప్పటికీ మూడిళ్లు మాత్రమే నిర్మించారు. ఇందులో వంద కుటుంబాల వరకు కాపురముంటున్నారు. వీరికి ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవు. దీంతో నానా అవస్థలు పడుతున్నారు. సీపీఐ మండల కార్యదర్శి శివకుమార్ బుధవారం సాయంత్రం జగనన్న కాలనీని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత


గ్రీన్ ఇండియా సేవ్ ఇండియా కార్యక్రమంలో విద్యార్థులు

నాయుడుపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చేపట్టాలని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ అంబటి రవీంద్ర అన్నారు. నాయుడుపేటలో బుధవారం గ్రీన్ ఇండియా.. సేవ్ ఇండియా నినాదంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గాంధీమందిరం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. విపరీతంగా పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని చెట్లు నియంత్రించగలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో డీన్ శ్రీనివాసులు, ఏవో సుధీర్, మురళీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా స్వామిత్వ సర్వే

కోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వామిత్వ భూ సర్వేను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వేణు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వామిత్వ సర్వేపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిగింది. ఆగస్టు 1నుంచి మండలంలోని చెందోడు, కేశవరం, గూడలి, కోట, కొత్తపట్నం, సిద్ధవరం, అల్లంపాడు, చిట్టేడు పంచాయతీల్లో భూములు, ఇంటి స్థలాలు సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. సర్వేలో పంచాయతీ కార్యదర్శులతో పాటు డిజిటల్ అసిస్టెంట్‌లు, విలేజ్ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కీలకంగా వ్యవహరించాలన్నారు.

గ్రామ కంఠం భూముల సర్వేపై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ జనార్దన్

చిట్టమూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1 నుంచి చేపట్టనున్న గ్రామ కంఠం భూముల సర్వేపై కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో శిక్షణ ఇచ్చారు. ఈవోపీఆర్డీ జనార్దన్, మాస్టర్ ట్రైనర్ సర్వేయర్లు మహిధర్, గోవర్ధన్ శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయ అభివృద్ధికి కృషి

ఏర్పేడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని విశాఖకు చెందిన మైత్రి ఇన్‌ఫ్రాక్చర్ మైనింగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ తేళ్ల బాలపవన్ పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం ఆయన గుడిమల్లం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంలో నిత్యాన్నదానానికి తమ వంతు ఆర్థిక సాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈక్రమంలో బుధవారం విశాఖలోని సంస్థ కార్యాలయానికి ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, మాజీ ఛైర్మన్ గిరినాయుడు, వేద పండితులు పవన్ యోగేంద్రశర్మలు వెళ్లి బాలపవన్‌ను సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. త్వరలో ఆలయానికి వచ్చి ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యమవుతానని బాలపవన్ వారికి చెప్పారు.

ప్రభుత్వ పథకాలతో అభివృద్ధి చెందండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను మహిళా సమాఖ్య సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ సూచించారు. వెలుగు కార్యాలయంలో మహిళ సమాఖ్య సభ్యులకు బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకులో పరపతి పెంచుకోవాలన్నారు.

కరాటే చాంపియన్‌షిప్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి(క్రీడలు), జూలై 30(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో ఆగస్టు 17న సిద్ధార్థ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2025 పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ ప్రెసిడెంట్ నల్లూరి మోహన్‌రావు, నవీన్ మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు, కేఐవో ఏపీ ఆర్గనైజింగ్ కమిషన్ మెంబర్ పి.నవీన్, అకాడమీ ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు పాల్గొన్నారు.

జీఎస్ఎల్వీ ఎఫ్16 విజయవంతంపై సంబరాలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇస్రో చేపట్టిన జీఎస్ఎల్వీ ఎఫ్16 రాకెట్ ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో నగరంలో కూటమి నాయకులు, స్థానికులు సంబరాలు చేసుకున్నారు. బుధవారం స్థానిక ఘంటసాల కూడలిలో జాతీయ పతాకాలు చేతబట్టి భారత్ మాతాకీజై అంటూ నినాదాలు చేశారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందం పంచుకున్నారు. నిసార్ ఉపగ్రహ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన ఇస్రో శాస్త్రవేత్తలకు జేజేలు పలికారు.

డి.వడ్డిపల్లి సర్పంచ్ చెంచమ్మ మృతి


చెంచమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఇన్‌సెట్లో ఫైల్‌ఫొటో

డక్కిలి, జులై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వడ్డిపల్లి పంచాయతీ సర్పంచ్ వేపమాను చెంచమ్మ(65) బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో చికిత్స కోసం చెన్నై తీసుకెళుతుంగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 2013, 2021లో సర్పంచ్‌గా గెలుపొందిన చెంచమ్మ ప్రభుత్వ నిధులతో పాటు సొంత డబ్బులు ఖర్చుచేసి పంచాయతీలో సిమెంటు రోడ్లు వేశారు. పచ్చదనం కోసం మొక్కలు నాటించి వాటిని సంరక్షించే బాధ్యతను ఆమే తీసుకొన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు కట్టించినందుకు ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి స్వచ్ఛ మహిళ చాంపియన్ అవార్డుకు ఎంపికయ్యారు. 2014లో ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకొన్నారు. చెంచమ్మ మృతి చెందారన్న విషయం తెలియగానే ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు. చెంచమ్మ మృతితో టీడీపీ మంచి మహిళా నాయకురాలిని కోల్పోయిందన్నారు. కాగా ఆయన తోటు పాటు డక్కిలి తహసీల్దారు శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ దందవోలు పెంచలరెడ్డి, మాజీ ఎంపీపీ వెలికంటి చెంచయ్య, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతమాను వెంకటపతి తదితరులు చెంచమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. గురువారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగివుండాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి సులోచనారాణి

చిల్లకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగివుండాలని న్యాయమూర్తి సులోచనారాణి అన్నారు. బుధవారం మండలంలోని అపెక్స్ పరిశ్రమలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినం కార్యక్రమాన్ని నిర్వహించి మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి హక్కులపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు, చిన్నపిల్లల అక్రమ రవాణా పెరిగిపోతోందని, వాటిని నియంత్రించే చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ గీతాకుమారి, ఎస్ఐ సురేష్‌బాబు, అరవ పార్వతయ్య, మహబూబ్ బాషా, పరిశ్రమ ప్రతినిధులు శైలజ, షరీఫ్, మోహన్ పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో అలసత్వం వద్దు: ఎమ్మెల్యే


సబ్‌రిజిస్ట్రార్‌ను వివరాలడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో అధికారులు అలసత్వం వీడాలని, ఫిర్యాదులు అందితే సహించేది లేదని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం సత్యవేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చూడాలని సబ్‌రిజిస్ట్రార్ రూపవాణిని సూచించారు. కార్యాలయాన్ని ఇప్పటి అవసరాలకు తగినవిధంగా ఆధునీకీకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉదయం 10గంటల సమయంలో కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు కార్యాలయంలో ఒక్క ఉద్యోగి మాత్రమే ఉండడంతో కొంత అసహనం వ్యక్తం చేశారు.

క్వారీ వద్ద గిరిజనుల నిరసన

సత్యవేడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చమర్తికండ్రిగ వద్ద క్వారీల అక్రమాలపై చర్యలు తీసుకుని గిరిజనులకు న్యాయం చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కంకర క్వారీల వద్ద గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నిరాజ్ మాట్లాడుతూ అటవీ సంపదపై ఆధారపడి జీవించే గిరిజనుల హక్కులను ఇక్కడి క్వారీల యాజమాన్యాలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించారు. వారి భూములు, ఇళ్ళ స్థలాలు ఆక్రమించుకుని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. గిరిజనులు అడవుల్లోకి వెళ్లేందుకు దారి కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు చంద్ర, మురళి, ధనుంజయులు, గిరిజనులు పాల్గొన్నారు.

మునిరెడ్డికి నివాళి


మునిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఊరందూరులో బుధవారం జరిగిన అమాస మునిరెడ్డి కర్మక్రియల కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ హాజరయ్యారు. మునిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ ధ్యేయం


శ్రీనిధి రుణాల పత్రాలు అందిస్తున్న ఆదిమూలం

సత్యవేడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, పేదరికం లేని సమాజం నిర్మించాలన్న సంకల్పంతో ఏర్పాటయిన మహిళా డ్వాక్రా సంఘాలకు రూపకర్త ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో త్రివిక్రమరావు, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ ఆధ్వర్యంలో శ్రీనిధి రుణాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనిధి రుణాలతో కుటీర పరిశ్రమలు స్థాపించి మహిళలు అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. శ్రీనిధి ఇంచార్జ్ మేనేజర్ ఆదిల్‌బాష, ఎస్బీఐ మేనేజర్ సూర్యప్రకాష్, చైతన్య, సుబ్బారావు, కార్తీక్, వెలుగు కో ఆర్డినేటర్‌లు శివకుమార్, పుల్లయ్య, బాలమురళీ కృష్ణ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఈశ్వరయ్య కాలనీలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో బుధవారం యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సంస్థ విద్యార్థులకు విద్యాసామగ్రిని వితరణ చేసింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు హేమకుమార్ మాట్లాడుతూ తాను కూడా పేదరికం నుంచే వచ్చానన్నారు. వారి బాధలు తెలుసునందున తమ సంస్థ తరపున పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రమేష్, నారాయణ, శ్రీనివాసులు, సురేష్ బాబు, అమీర్‌బాషా, చంద్రకాంత్, ప్రదీప్‌కుమార్, పోతురాజు, రాజారాణి, మునిలక్ష్మి, శిరీష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన



శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుగంగకాలనీలో సరస్వతీబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసూన్న మాట్లాడుతూ 8, 9, 10వ తరగతి బాలికలకు యుక్తవయసులో వచ్చే రుతు సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించారు. వైద్యులు వివేక్ చైతన్య, ఉమామహేశ్వర్, అర్చనలు పిల్లలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పల్లం పాఠశాలకు టైమర్ బెల్ అందజేత


టైమర్ బెల్ అందజేస్తున్న పురుషోత్తమరెడ్డి

ఏర్పేడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలకు వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పురుషోత్తమరెడ్డి బుధవారం రూ.10వేల విలువ చేసే టైమర్‌బెల్ అందజేశారు. దీనిని ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ స్వీకరించారు. దాత మాట్లాడుతూ పలు పాఠశాలలకు తన వంతు సాయంగా అవసరమైన వస్తువులు అందజేశానన్నారు. ప్రధానోపాధ్యాయులు మధు, శ్రీనివాసులు, వెంకటరత్నం, విజయశేఖర్, బాబు, వసంతకుమారి, గంగలయ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ధర్మరాజు బ్రహ్మోత్సవాల ఆహ్వానం

ఏర్పేడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పాపానాయుడుపేటలో ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈమేరకు బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆగస్టు 1 నుంచి 15 వరకు వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10న అగ్నిగుండ మహోత్సవానిని రావాలని దొరకృష్ణ, జాఫర్‌లు కోరారు.

పక్కాగా బంగారు కుటుంబాల ఎంపిక సర్వే


మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో బంగారు కుటుంబాల సర్వే పక్కాగా చేపట్టాలని డ్వామా శ్రీనివాస ప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పీ-4పై మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వీర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తొలుత 169 మందిని బంగారు కుటుంబాలుగా గుర్తించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరింత పక్కాగా సర్వే చేసి ఎంపిక చేయాల్సి ఉందన్నారు. ఎంపిక చేసిన కుటుంబాలను దత్తతు తీసుకునే ప్రక్రియ కూడా తక్షణం చేపట్టాలన్నారు. ఎంపీడీవో వెంకటరత్నమ్మ,అధికారులు పాల్గొన్నారు. వీఎస్‌పురం పంచాయతీలో చెరువు పూడికతీత పనులను పీడీ పరిశీలించారు.

శక్తి స్వరూపిణిగా ఎల్లమ్మ దర్శనం



రేణిగుంట జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎల్లమ్మ జాతర సందర్భంగా మూడవరోజు అమ్మవారు శక్తి స్వరూపిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక సంత గేటు సమీపంలోని ఎల్లమ్మ ఆలయంలో ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి మేళ తాళాలతో ఊరేగించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనపై ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి లహరిణి బుధవారం తొట్టంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చిన్నవయసులో పెళ్లిళ్లు చేయడం వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సంపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ నాగేంద్ర, ఎంపీహెచ్ఏ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రగతి సంస్థ సిబ్బంది

శ్రీకాళహస్తి, జూలైయ 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా తీవ్రమైన నేరమని ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ నారాయణ అన్నారు. పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా సంక్షేమ కార్యదర్శి దివ్య మాట్లాడుతూ ప్రలోభాలకు గురికావడంతో మానవ అక్రమ రవాణా, బాల బాలికల అక్రమ నిర్బంధం, రవాణా, విక్రయాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ లలిత, మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుధీర్



శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): తమ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రాబోయే వర్షాకాలంలో ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు.

ముక్కంటి సేవలో గాలి జనార్దన్‌రెడ్డి



శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం గనుల వ్యాపారి, ఎమ్మెల్యే(కర్ణాటక) గాలి జనార్దన్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు నాగమల్లి దుర్గాప్రసాద్, బాలాజీ, ఖాదర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. సినీనటుడు అశోక్‌కుమార్ కూడా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

చెంచురెడ్డికి పరామర్శ



శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డిని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, వైసీపీ నాయకులు సురేష్, శరవణ పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

సత్యవేడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వ్యకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్యవేడులో బుధవారం జరిగింది. ఎస్ఐ రామస్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కుమ్మరిగుంటకు చెందిన ధనశేఖర్ (58) భార్య ఐదేళ్ళ క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పట్నుంచి ధనశేఖర్ తాగుడుకు బానిసయ్యాడు. ఈక్రమంలో కొంతకాలంగా ఇతడి ఆరోగ్యం క్షీణించింది. భార్య వియోగంతో తీవ్ర మనస్తాపం చెందిన ధనశేఖర్ మంగళవారం రాత్రి పురుగుమందు తాగి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని వీఎంపల్లిలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి మంత్రి అయిన తరువాత రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నారని తెలిపారు. అనంతరం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వీఎంపల్లిలో ఆర్వోవాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, కంఠా రమేస్, కాసరం రమేష్, కోబాకు లక్ష్మణ్ పాల్గొన్నారు.

సింహ వాహనంపై కల్యాణ వీరభద్రస్వామి

నారాయణవనం, జూలై 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధగా ఉన్న భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం స్వామి వారికి నిత్య పూజాలనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9.30 గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం వీరభద్రస్వామి వారిని సింహవాహనంపై గ్రామ వీధులలో ఊరేగించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్ర మంలో ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

బడి మానేసిన పిల్లలకు కౌన్సెలింగ్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని ఎంఈవో రవీంద్రనాథ్ అన్నారు. కాంపాళెం పంచాయతీలోని చలం వారి గిరిజనకాలనీలో బడి మానేసిన పదిమందితో ఆయన మాట్లాడారు. కిలోమీటరుపైన పొలాల్లో నడిచి వెళ్లాలంటే పిల్లలకు కష్టమని తల్లిదండ్రులు చెప్పారు. సమీపంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీకి ఆటో ద్వారా తీసుకువెళ్తామని ఆయన చెప్పడంతో అంగీకరించారు. పిల్లలకు అడ్మిషన్ కల్పించాలని ఆదేశించ

నిశ్చితార్థమయ్యాక ముఖం చాటేశాడు

● యువతి ఫిర్యాదు

రేణిగుంట జూలై 30 (ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థమయ్యాక పెళ్లి చేసుకోలేదని యువకుడిపై ఓ యువతి బుధవారం గాజులమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసలు తెలిపిన వివరాల మేరకు తూకివాకం పంచాయతీ ఎర్రంరెడ్డిపాలెంకు చెందిన హరితకు ఎస్ ఆర్‌పురం మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన ఏసుతో గత ఏడాది డిసెంబర్‌లో ఇరుపక్షాల పెద్దలు నిశ్చితార్థం చేశారు. అయితే ఇప్పటివరకూ ఆ యువకుడు పెళ్లిని దాటవేస్తుండటంతో హరిత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.